జాతీయ రహదారికి 'మహర్దశ'

- సర్వీసు రోడ్లు, బస్‌షెల్టర్ల నిర్మాణం పూర్తి
- బారికేడ్లు, వీధి దీపాల ఏర్పాటు
- పూర్తయిన రంగారెడ్డిపల్లి బ్రిడ్జి
- అందుబాటులోకి రానున్న జాతీయ రహదారి



గండేడ్ వద్ద పూర్తయిన జాతీయ రహదారి నిర్మాణం

గండేడ్: మహబూబ్‌నగర్–చించోలి జాతీయ రహదారి నిర్మాణం దాదాపుగా పూర్తి అయ్యింది. బెంగుళూరు–ముంబై మధ్య ఉన్న జాతీయ రహదారులను అనుసంధానం చేసేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని భూత్పూర్ నుంచి కర్ణాటకలోని మన్నెకలి వరకు ఉన్న 192 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని విస్తరించడానికి ప్రణాళిక రూపొందించింది. తెలంగాణలో మూడు జిల్లాలను కలుపుతూ వెళ్తున్న ఈ రోడ్డును 167 జాతీయ రహదారిగా గుర్తించారు. ఇందుకు గాను కేంద్రం రూ.709 కోట్లు మంజూరు చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్, మహబూబ్‌నగర్, హన్వాడ, మహమ్మదాబాద్, గండేడ్, నారాయణపేట జిల్లా కోస్గి, వికారాబాద్ జిల్లా దుద్యాల వరకు ఆయా మండలాల్లోని గ్రామాల మీదుగా ఈ రోడ్డు వెళ్తోంది. మొదటి ప్యాకేజిలో భాగంగా భూత్పూర్ నుంచి వికారాబాద్ జిల్లా దుద్యాల వరకు 60 కిలోమీటర్ల మేర రూ.440 కోట్లతో పనులు ప్రారంభించారు. దాదాపు రెండు సంవత్సరాలు కానుండడంతో ప్రస్తుతం పనులు చివరి దశలో ఉన్నాయి.

మహబూబ్‌నగర్ వద్ద బైపాస్ పనులు..

ప్రధాన పట్టణాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చోట బైపాస్ రహదారుల నిర్మాణానికి రూపకల్పన చేశారు. మహబూబ్‌నగర్ భూత్పూర్ రూట్లో నెక్సా కార్ల షోరూం నుంచి పాలమూరు యూనివర్సిటీ పక్కనుంచి చిన్నదర్పల్లి సమీపం వరకు బైపాస్ ఏర్పాటు చేస్తున్నారు. ఆర్వోబీ, జంక్షన్లు ఏర్పాటు దాదాపుగా పూర్తి కావచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం చుట్టూ 8 కిలోమీటర్ల మేర ఈ బైపాస్ నిర్మాణం పనులు 80 శాతం మేర పూర్తయ్యాయి. చిన్న చిన్న కొండలు రాళ్ల రప్పలు ఇతరత్రా అడ్డంకులను తొలగించి రోడ్డు వేస్తున్నారు. దీని ఏర్పాటుతో దూర ప్రాంతాలకు వెళ్లే వారికి పట్టణంలోకి వెళ్లే వాహనదార్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండకపోగా సమయం కూడా ఆదా అవుతుంది.



సల్కర్‌పేట్ వద్ద పూర్తయిన బస్‌షెల్టర్

రంగారెడ్డిపల్లి వద్ద రీ అలైన్‌మెంట్ పనులు పూర్తి..

బెంగుళూరు–ముంబాయికి దాదాపు 150 కిలోమీటర్ల మేర దూరం తక్కువ కావడంతో మహబూబ్‌నగర్–చించోలి రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. వందల కొద్ది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రంగారెడ్డిపల్లి వద్ద మలుపు ప్రమాదకరంగా ఉండడంతో పలు ప్రమాదాలు గతంలో చోటుచేసున్నాయి. గండేడ్ మండలం రంగారెడ్డిపల్లి వద్ద రీ అలైన్‌మెంట్ పనులు పూర్తి కావచ్చాయి. సల్కర్‌పేట్ పాఠశాల వద్ద నుంచి రంగారెడ్డిపల్లిలోని దర్గా వరకు రోడ్డును నేరుగా నిర్మిస్తున్నారు. ఇందుకు సమీప గ్రామాల రైతుల నుంచి అప్పట్లో 1.20 ఎకరాల భూమిని సేకరించారు. ఇక్కడే వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి బీటీ వేస్తున్నారు.

చురుగ్గా అంచన్‌పల్లి టోల్‌ప్లాజా పనులు..

జాతీయ రహదారి నిర్మాణం అనంతరం నిర్వహణ నిమిత్తం టోల్‌ప్లాజా ఏర్పాటు చేస్తారు. గండేడ్ మండలంలోని అంచన్‌పల్లి గేటు వద్ద టోల్ ప్లాజా ఏర్పాటు చేస్తున్నారు. 1.13 ఎకరాల భూమిలో దీనిని నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం టోల్ బూత్ సిబ్బంది నివాసం ఉండడంతో పాటు అంబులెన్స్ అత్యవసర సేవలను దృష్టిలో ఉంచుకొని అనుకూలమైన విధంగా ఇక్కడ టోల్‌ప్లాజా నిర్మించనున్నారు. ఇక్కడ సీసీరోడ్డు పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు వేగంగా సాగుతున్నాయి. ఇది దాదాపుగా తుది దశకు చేరుకుంది.

పూర్తయిన బీటీ నిర్మాణం..

భూత్పూర్ నుంచి దుద్యాల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం 90 శాతం పూర్తి కావచ్చింది. అక్కడక్కడ కొన్ని చోట్ల మినహా 60 కిలోమీటర్లకు గాను దాదాపుగా 50 కిలోమీటర్లకు పైగా రోడ్డు పూర్తయ్యింది. చిన్న, పెద్ద వాటిని కలుపుకొని 40 మలుపులను నేరుగా చేశారు. బీటీతో పాటు భూత్పూర్ వద్ద రెండు చోట్ల బ్రిడ్జిలు పూర్తయ్యాయి. రెండు మూడు చోట్ల మినహా అన్ని గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు సైతం పూర్తయ్యాయి. ఆయా గ్రామాల వద్ద బస్ షెల్టర్లను కూడా నిర్మించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా బారికేడ్లు నిర్మించారు. దీంతో ఆయా గ్రామాల వద్ద ఇరువైపులా వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్..

చించోలి–మహబూబ్‌నగర్ రహదారి సింగిల్ రోడ్డు ఉన్నప్పటి నుంచి రద్దీగా ఉండేది. బెంగుళూరు–ముంబాయికి ఈ దారి తక్కువ దూరం కావడంతో నిత్యం వందల కొద్ది వాహనాలు వెళ్లేవి. డబుల్ రోడ్డు అయిన తర్వాత వాటి సంఖ్య మరింతగా పెరిగింది. పెరిగిన వాహనాలకు అనుగుణంగా రోడ్డు సౌకర్యం లేక వాహనదారులు నానా ఇబ్బందులు పడేవారు. మలుపులు, గుంతలు, శిథిలావస్థలో బ్రిడ్జిలతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. జాతీయ రహదారి పనులు శరవేగంగా కొనసాగుతుండడంతో త్వరలో ఈరోడ్డు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.

క్లుప్తంగా

మైసమ్మ ఆలయంలో జన జాతర



నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయంలో భక్తుల జన జాతర కొనసాగింది. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు మైసమ్మను దర్శించుకొని ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. దీంతో అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఆదివారం మైసమ్మ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులకు భూమిపూజ



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు సత్యనారాయణ స్వామి కాలనీలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత భూమి పూజ చేశారు. మున్సిపాలిటీ జనరల్ ఫండ్ రూ.3లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించటంతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్, చైర్ పర్సన్ దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సతీష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మాలమహానాడు అధ్యక్షుడిగా అశోక్‌కుమార్



మహబూబ్‌నగర్ రూరల్: మాల మహానాడు మహబూబ్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా హన్వాడ మండలం వేపూర్ గ్రామానికి చెందిన ఎం.అశోక్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య సూచన మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగడ్డ యాదయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల కృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్యాగరి చెన్నయ్యలు అశోక్‌కుమార్‌కు మహబూబ్‌నగర్ నియోజవర్గ అధ్యక్షుడిగా ఎంపిక చేసి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మిట్టమీది బాలరాజు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, నాయకులు శ్రీనివాసులు, గోకం చెన్నయ్య, ఎస్.వెంకట్రాములు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్నిక



పెద్ది పెంటయ్య

జడ్చర్ల టౌన్: తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జడ్చర్లకు చెందిన పెద్ది పెంటయ్య ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్ జలవిహార్‌లో జరిగిన ఎన్నికలో ఆయన 191ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా పెద్ది పెంటయ్య జడ్చర్ల విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. సంఘం సభ్యులు తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా సంఘం అభివృద్ధి కోసం పాటు పడతానని పేర్కొన్నారు. పెద్ది పెంటయ్య ఎన్నికపై మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల మున్నూరుకాపు సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు



హన్వాడ: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలు దేశంలో ప్రజాస్వామ్య మనుగడకు పెను ముప్పుగా పరిణమిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ తెలిపారు. ఆదివారం దాచక్‌పల్లిలో సీపీఐ మండల నాలుగో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం నయవంచన తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దేశంలో సహజ వనరులపై కన్నేసిన మోదీ సర్కార్ గిరిజనులను, ఆదివాసులను అంత మొందించేందుకు ఆపరేషన్ కాగర్ అమలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బహుళజాతి పెట్టుబడిదారులకు దేశ సంపదను కారుచౌకగా దోచిపెడుతోందని మండి పడ్డారు. దేశభక్తి ముసుగులో ప్రజలమధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతూ కుట్రలు పన్నుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకర్, కార్యవర్గ సభ్యులు సురేష్, ఆనంద్, రాజునాయక్, శ్రీనువాస్, భగవంత్, రామస్వామి, లక్ష్మన్, బాలు, శశికళ, వెంకటేష్, పాండు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ గంగాపురం

జడ్చర్ల టౌన్: గ్రామంలో యువకులు ప్రారంభించిన హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ గంగాపురం లక్ష్యాలు చేరుకోవాలని ఎస్‌ఐ జయప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం సంస్థకు సంబంధించిన భవిష్యత్ లక్ష్యాలైన క్రీడాప్రాంగణం, లైబ్రరీ ఏర్పాటు వంటి కార్యక్రమాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ గూర్చి సభ్యులు ఆయనకు వివరించారు. ఒకరిద్దరితో మొదలైన హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ గంగాపురం నేడు 125మంది సభ్యులతో కూడి సైన్యంగా మారిందన్నారు. నిరుపేద, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కావాల్సిన సదుపాయాల ఏర్పాటుకు చేస్తున్న కృషిని తెలిపారు. భవిష్యత్‌లో మంచి సమాజ నిర్మాణం కోసం అవసరమైన లైబ్రరీ ప్రారంభం, ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలా క్రీడాప్రాంగణం ఏర్పాటు, విద్యార్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వాటికి సంబంధించిన కార్యాచరణ వాల్‌పోస్టర్ రూపొందించినట్లు తెలిపారు. సంస్థ సభ్యులు చేస్తున్న కృషిని, సేవా కార్యక్రమాలను ఎస్‌ఐ అభినందించారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణ చేసిన ఎస్‌ఐ జయప్రసాద్

బాధితులను పరామర్శించిన మంత్రి

జడ్చర్ల: మండలంలోని కోడ్గల్ గ్రామంలో మణెమ్మ మృతి చెందడంతో ఆదివారం మంత్రి వాకిటి శ్రీహరి బాధిత కుటుంబానికి పరామర్శించారు. మక్తల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాధమ్మ సోదరి మణెమ్మ కోడ్గల్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి ఉన్నారు.

ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



జడ్చర్ల టౌన్: భక్తమార్కండేయ దేవాలయం శాంతినగర్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు బాటలు వేస్తోందని రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ అన్నారు. ఆదివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో భక్త మార్కండేయ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అభివృద్ధి పనుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో భక్తులు అయ్యన్న, విజయ్‌కుమార్, వేణుగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీరామ్, మురళి, నరేష్, మల్లేష్, బక్క రాజేశ్వర్‌రావు, లవకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు పొందిన విద్యార్థులతో మాస్టర్ వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల మైదానంలో శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్, సీనియర్ మాస్టర్ కోటకదిర వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ మనశ్విని, నరేందర్, సాయి చరణ్, శ్రావణ్ ఎల్లో బెల్టులు, సంకీర్తన ఆరెంజ్ బెల్టు, శ్రీహిత, ప్రదీప్, యశ్వంత్ మెరూన్ బెల్టులు, బి.కిరిటీ, నితిష్‌కుమార్ బ్లూ బెల్టులు సాధించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ వర్షిణి, వెంకటేశ్, శ్రీధర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల కోసం దళారులను ఆశ్రయించొద్దు



డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్

మహబూబ్‌నగర్ రూరల్: సర్టిఫికెట్ల కోసం దళారులను, మధ్యవర్తులను ఆశ్రయించొద్దని అర్బన్ మండల డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్ కేసిరెడ్డి అన్నా రు. ఆదివారం సాక్షితో ఆయన మాట్లాడుతూ దర ఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సంబంధించిన కుల, ఆదాయ, స్థానిక, ఈడబ్ల్యూఎస్ వంటి సర్టిఫికె ట్లు ఏ రోజుకు ఆ రోజు జారీ చేస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో ఎర్రవల్లి, బోయపల్లి, ఏనుగొండ, ఎదిర, పాలకొండ, మహబూబ్‌నగర్ రెవెన్యూ గ్రామాలున్నాయని, ఆయా రెవెన్యూ గ్రామాలకు సిబ్బందిని కేటాయించామని, వారితో పని చేయించుకోవాలని పేర్కొన్నారు. అర్బన్ మండలం జిల్లా కేంద్రం కావడంతో ధ్రువపత్రాల కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుంటారని తెలిపారు. ప్రజలు నేరుగా రావాలని, సిబ్బంది ఇబ్బంది పెడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. దళారులు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని, ప్రజలకు హెల్ప్ డెస్క్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

బసవేశ్వరుడి ఆశయాలను సాధించాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వీరశైవుల ఆరాధ్య దైవమైన బసవేశ్వరుడి ఆశయాలను సాధించాలని జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్ అన్నారు. ఆదివారం తువ్వగుట్టలోని బసవ భవన్‌లో పట్టణ వీరశైవ సమాజం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా ముందడుగు వేయాలన్నారు. వీరశైవ లింగాయత్–లింగ బలిజలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు వజ్రలింగం, అధ్యక్షుడు పోకల శివుడు, కోశాధికారి శర్వణ్ణ, నాయకులు ఎ.రాజసింహుడు, వీరేశలింగం, చంద్రశేఖర్, శెట్టి చంద్రశేఖర్, కొండా వీరన్న, ఉమాదేవి, శివకుమార్ పాల్గొన్నారు.

షిరిడీ సాయి మందిరాల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలోని వేదికపై ముఖ్యవక్తలు, ప్రముఖులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీద్వారకామయి బాబా మందిరం ఆవరణలో ఆదివారం షిరిడీ సాయిబాబా మందిరాల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. షిరిడీసాయి భక్త ఐక్య వేదిక చైర్మన్ మంచికంటి ధనుంజయ మాట్లాడుతూ ప్రతి షిరిడీ సాయి మందిరంలో ఆవును పెట్టుకొని పూజించాలని, ఆవులేని మందిరాలకు అందజేస్తామన్నారు. సాయిబాబా ఆలయాల అభివృద్ధి గురించి వివరించారు. షిరిడీ సాయి తత్వ ప్రచారకులు మైనంపాటి ప్రసాద్ మాట్లాడుతూ షిరిడీసాయి జీవితచరిత్ర తెలియజేశారు. కార్యక్రమంలో షిరిడీసాయి హారుతుల భాను, ద్వారకామయి బాబా మందిరం చైర్మన్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి గోవర్ధన్‌చారి, ప్రసాద్, చంద్రకాంత్‌రెడ్డి, సుదర్శన్ యాదవ్, రుద్రోజీ, మోహన్, సేవాదళ్ సభ్యులు, షిరిడిసాయి భజన బృందం, ఉమ్మడి జిల్లాలోని శిరిడిసాయి దేవాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువమోర్చా అధ్యక్షుడిగా తోకల శ్రీకాంత్

కోయిల్‌కొండ: బీజేపీ మండల యువమోర్చ అధ్యక్షుడిగా తోకల శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పార్థసారథి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో బీజేపీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. యువ మోర్చాకు ఎన్నిక చేసిన బీజేపీ మండల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పిచ్చిమొక్కల తొలగింపు.. ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

- సాలార్‌నగర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్
- చొరవ చూపిన ఏఈ శ్రీకాంత్

సాక్షి ఎఫెక్ట్..

గండేడ్: 'సాక్షి' కథనానికి అధికారులు స్పందించారు. పిచ్చి మొక్కల తొలగింపుతో పాటు ఏకంగా ఏఈ చొరవతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. వివరాల్లోకి వెళితే.. గండేడ్ మండలంలోని సాలార్‌నగర్‌లో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. వర్షం పడితే కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడేది. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతు చేయలేదు. దీంతో సాలార్‌నగర్ గ్రామస్తుల కరెంటు కష్టాలను సాక్షి 'చినుకు పడితే అంతరాయమే' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. దీంతో ఏఈ శ్రీకాంత్ స్పందించి గ్రామంలో విద్యుత్ అంతరాయంపై ఆరా తీశారు. ఆదివారం గ్రామంలో వైర్ల చుట్టూ, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించారు. వైర్లను సరిచేసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. ఇన్సులేటర్లు ఎక్కడెక్కడ సమస్య ఉందో వాటిని కూడా సరిచేశారు. దీంతో గ్రామస్తులు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.



సాలార్‌నగర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్‌కు ప్రత్యేకస్థానం

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్‌కు ప్రత్యేక స్థానం ఉందని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. చివరి ఆదివారం సందర్భంగా పట్టణంలోని 29వ వార్డు కుమ్మరివాడిలో సేవాదళ్ అసెంబ్లీ అధ్యక్షులు జగదీశ్వర్ ఆధ్వర్యంలో ముడా చైర్మన్ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల్లో సేవాదళ్ విభాగం ముందుండి పనిచేస్తుందన్నారు. జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సేవాదళ్‌ను మరింతగా బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్‌పాష, దేవరకద్ర అసెంబ్లీ ఇన్‌చార్జి వేణుకుమార్, సుభాష్‌ఖత్రి, దేవన్న, శ్రీను పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి

'ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి 'ఏ'లోకి మార్చాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, రిటైర్డ్ ముదిరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ మంది ముదిరాజ్‌లను గెలిపించాలని కోరారు. అనంతరం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ అందరూ చైతన్యవంతులై రాజకీయంగా ఎదగాలన్నారు. తమను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల జిల్లా అధ్యక్షులు రజనీకాంత్, సి.నారాయణ, జనార్దన్, నాయకులు కోట్ల హనుమంతు, శ్రీనివాసులు, శంకర్, సుధాకర్, యాదగిరి, సత్యం, మహేష్ పాల్గొన్నారు.



ఉద్యోగులను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ముదిరాజ్ మహాసభ కార్యవర్గం ఎన్నిక



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని తెలుగుగూడెం గ్రామంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభ గ్రామ అధ్యక్షుడిగా క్యాతమోని పారేష్, ప్రధాన కార్యదర్శిగా చింటు, ఉపాధ్యక్షులుగా బి.సిద్ధయ్య, సంజీవ, సహాయ కార్యదర్శులుగా తుప్పలి యాదయ్య, కె.వెంకటేష్, కోశాధికారిగా తుప్పలి బాలస్వామిలను ఎన్నుకున్నారు. జమిస్తాపూర్ గ్రామ మహాసభ అధ్యక్షుడిగా బంటు రా జు, ప్రధాన కార్యదర్శిగా గుద్దెటి కృష్ణ, ఉపాధ్యక్షులుగా వాకిటి నరేష్, గుద్దెటి లక్ష్మయ్య, సహాయ కార్యదర్శులుగా వాకిటి గోపాల్, వాకిటి రాఘవేందర్, కోశాధికారిగా రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లను రాజ్యాధికారం వైపుగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. మహాసభ మండల అధ్యక్షుడు చంద్రుడు, జిల్లా ప్రచార కార్యదర్శి యాదయ్య, వెంకట్రాములు పాల్గొన్నారు.

కాలనీల్లో అభివృద్ధి పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పంచముఖి కాలనీ (డివిజన్ నం.9) లో ఇటీవల నిర్మించిన సీసీరోడ్డును ఆదివారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని, రోడ్డు పక్కన తేలిన తాగునీటి పైపులైన్‌ను సరి చేయించాలని కాలనీవాసులు విన్నవించారు. అనంతరం దేవునిగుట్ట (డివిజన్‌నం.3)లో నిర్మిస్తున్న కాటమయ్య స్వామి ఆలయ పనులను పరిశీలించారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ మూసా నరేందర్, గౌడ సంఘం నాయకులు సాయిలుగౌడ్, శ్రీధర్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, పురుషోత్తంగౌడ్, సీహెచ్ వెంకటేష్, రాజయ్యగౌడ్ పాల్గొన్నారు.



పంచముఖి కాలనీలో తాగునీటి పైపులైన్, డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఆనంద్ కుమార్‌గౌడ్

పీఏసీఎస్‌గా హన్వాడ ఎఫ్‌ఏసీఎస్

- నేడో రేపో డీసీసీబీలో ఖాతా ప్రారంభం
- ఇక ఎస్‌బీఐతో లింక్ లేకుండా రైతులకు రుణాలు



పీఏసీఎస్‌గా మారిన హన్వాడ ఎఫ్‌ఏసీఎస్

హన్వాడ: మండల కేంద్రంలో రైతు సేవా సహకార సంఘం ఇక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంగా మారింది. వారం క్రితం ఎఫ్ఏసీఎస్ పాలకవర్గంలోని సభ్యులందరూ తీర్మాన పత్రాన్ని డీసీసీబీకి సమర్పించారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఇందుకు సంబంధించి నేడో రేపో స్థానిక ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్ డీసీసీబీలో స్థానిక పీఏసీఎస్ పేరిట ఖాతా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక సహకార సంఘం కార్యదర్శి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీసీసీబీలో ఖాతా ప్రారంభానికి కావల్సిన ఏర్పాట్లలో ఉన్నట్లు తెలిసింది. ఎఫ్‌ఏసీఎస్ పరిధిలో షేర్ హోల్డర్లుగా ఉన్న రైతుల్లో చాలా మంది మరణించడంతో సహకార సంఘం సిబ్బంది వారి ఆధార్‌కార్డులను సేకరించి తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులకే పీఏసీఎస్‌లో రుణాలు పొందేందుకు వీలుంది. ఇప్పటికే సుమారు 5వేల పైచిలుకు రైతుల సభ్యత్వం ఉండగా, ఈ సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.

ఎస్‌బీఐకి రాం రాం..

ఎస్‌బీఐతో అనుబంధంగా కొనసాగిన ఎఫ్‌ఏసీఎస్, పీఏసీఎస్‌గా మారడంతో ఆ బ్యాంకుతో సంబంధం లేకుండా పీఏసీఎస్ వారు నేరుగా రైతులకు రుణాలు ఇవ్వనున్నారు. రైతులకు పంట రుణాలతో పాటు వ్యవసాయ రంగానికి సంబంధించి అభివృద్ధి పనులన్నింటికీ రుణాలు పొందేందుకు రైతులకు సౌలభ్యం కానుంది. డీసీసీబీ ఆధ్వర్యంలో కొనసాగనున్న పీఏసీఎస్‌లో బ్యాంకులో మాదిరి అన్ని రకాల రుణాలను అమలు కానున్నాయి. ఇప్పటికే ఎస్‌బీఐ, ఏపీజీవీ బ్యాంకు ఉండగా, అదనంగా పీఏసీఎస్ రావడంతో మండల కేంద్రంలో మూడు బ్యాంకుల నుంచి రైతులు సేవలు పొందేందుకు అవకాశం ఏర్పడనుంది. స్థానిక రైతు సహకార సంఘానికి చెందిన భవనంలో కొనసాగిన ఎస్‌బీఐ తమ శాఖను ఇతర భవనంలోకి మార్చేందుకు పత్రికా ప్రకటన కూడా విడుదల చేశారు. అన్ని కుదిరితో అదే ప్రాంగణంలో మరో నూతన భవనాన్ని నిర్మించి ఎస్‌బీఐకు అద్దెకు ఇవ్వడంతో పాటు ప్రధాన రహదారి పొడువునా దుకాణ సముదాయాలు నిర్మించనున్నారు. దీంతో పీఏసీఎస్‌కు నెలనెలా అద్దెల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా డీసీసీబీ పాలకవర్గం, అధికారులతో స్థానిక పీఏసీఎస్ బృందం చర్చలు జరిపినట్లు తెలిసింది.



ఒకే భవన సముదాయంలో కొనసాగుతున్న ఎస్‌బీఐ, ఎఫ్‌ఏసీఎస్